26న కృత్రిమ అవయవాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 26న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కృత్రిమ అవయవాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వికలాంగులు వినియోగిస్తున్న పాత కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌కు మరమ్మతులు, కొత్త కృత్రిమ అవయవాల కోసం వ్యక్తిగత కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్ అవసరమైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరణ, వినికిడి లోపం కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వికలాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని ఆమె సూచించారు.

పట్టాలిచ్చారు...స్థలాలు మరిచారు

- వైసిపి పాలనలో ఇదీ నిర్వాకం
- అదే బాటలో కూటమి సర్కారు?
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వం 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' అనే పథకంలో పెద్ద ఎత్తున లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. అనేక మందికి ఆయా గ్రామాల సమీపంలోనే ఇళ్ల స్థలాలను సేకరించి ఇళ్ల నిర్మాణాలకు రుణాలను కూడా మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పలువురు పేదలు జగనన్న కాలనీల్లో ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే ఇంకా వేలాది మందికి నేటికీ స్థలాలు చూపించలేదు. పట్టాలు చేతికిచ్చి నాలుగేళ్లు అయినా సరే ఇప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడంతో పలువురు లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇళ్ల స్థలాల విషయంలో అనేక హామీలను ఇచ్చారని, అధికారంలోకి వచ్చి దగ్గరగా రెండేళ్లు కావస్తున్నప్పటికీ నేటికీ స్థలాలు చూపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో 1.60 లక్షల మందికి 734 జగనన్న కాలనీ లేఔట్లలో ఇళ్ల స్థలాల పట్టాలిచ్చినట్లు చూపారు. ఇందులో గ్రామాల్లో 2,928 ఎకరాల్లో 697 లే అవుట్లలో సుమారు లక్షా వెయ్యి ప్లాట్లు, పట్టణ ప్రాంతాల్లో 1390 ఎకరాల్లో 37 లే అవుట్లు సుమారు 59,300 ప్లాట్లు కేటాయించారు. గృహ నిర్మాణ సంస్థకు 305 లేఔట్లు అప్పగించారు. వీటిలో 36,262 మందికి పిఎంఎవై-1.0 కింద ఇళ్లు మంజూరు చేశారు. మిగతా 429 లేఔట్లలో సుమారు 1.24 లక్షల మందికి పట్టాలిచ్చారు. కానీ స్థలాలు చూపించ లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఈ లేఔట్లను చదును చేయకుండా ఇతర సదుపాయాలు కల్పించకుండా వదిలేయడంతో స్థలాలు చూపడానికి అవకాశం లేకుండా పోయింది.

పిఠాపురం మండలం నరసింగపురంలో లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన లేఅవుట్

నాలుగేళ్లుగా ఎదురుచూపులు

గత ప్రభుత్వం ఆర్భాటంగా అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలను గుర్తించి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పటికీ నేటికి స్థలాలు చూపించకపోవడంతో వేలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఉదాహరణకు పిఠాపురం పట్టణ పరిధిలోని సుమారు 4 వేల మంది లబ్ధిదారులకు నరశింగపురం-1, 2 లేపుట్లలో 56 ఎకరాలు, ఏడుకాలువల ప్రాంతంలో 18.49 ఎకరాలు, విరవాడ రోడ్డులోని 3.42 ఎకరాలు, కుమారపురం కొబ్బరితోటలో 1.82 ఎకరాలు, కుమారపురం వాటర్ వర్క్స్ వద్ద 5 ఎకరాలు, మసీదు మాన్యంలో 5.25 ఎకరాలు సేకరించారు. నేటికీ లబ్ధిదారులకు స్థలాలు చూపించలేదు. ఒక్కో లబ్ధిదారునికి సెంటు స్థలం చొప్పున సుమారు 90 ఎకరాలను కొనుగోలు చేసి అభివృద్ధి చేయకుండా వదిలేశారు. పట్టణ పరిధిలో స్థలాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో భూమిని కొనుగోలు చేశారు. అయితే చదును చేసేందుకు సుమారు రూ.10 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయడంతో గత ప్రభుత్వ హయాం నుంచి నేటికీ ఆ స్థలాలు అలానే ఉండిపోయాయి. దీంతో పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు.

ఎప్పుడిస్తారో..

కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు 2 సెంట్లు చొప్పున స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో పట్టాలిచ్చి స్థలాలు చూపకుండా ఉన్న లేఔట్లను తిరిగి సర్వే చేసి అదే లబ్ధిదారులకు స్థలాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాలకులు చెబుతున్నారు. ఇంకా మిగిలిపోయిన లబ్ధిదారులకు భూమిని కొనుగోలు చేసి స్థలాలను ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గత ప్రభుత్వంలో పట్టాలిచ్చిన లబ్ధిదారులకు ఇచ్చిన హామీ ప్రకారం 3,2 సెంట్లు చొప్పున త్వరితగతన స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు.

నేటికీ స్థలం చూపలేదు

నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వం మాకు సెంటు చొప్పున స్థలం ఇచ్చింది. పట్టా ఇచ్చినా నేటికి స్థలం చూపలేదు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి స్థలం చూపించి ఇంటి నిర్మాణం కోసం రుణం మంజూరు చేయాలి.

-కొమ్ము దివ్య, అయితే నగర్, పిఠాపురం

తిరుగుతూనే ఉన్నా..

స్థలాలు వెంటనే చూపించాలని అనేకసార్లు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. నేటికీ మాకు స్థలం చూపించలేదు. పట్టా చేత పట్టుకుని ప్రజా ప్రతినిధుల వద్దకు వెళుతున్నా ఎవరూ స్పందించడం లేదు. తక్షణమే మా సమస్యకు పరిష్కారం చూపాలి. అనేకమంది పేదలకు నేటికీ స్థలాలు ఇవ్వలేదు.

-దాకే శ్యామల, పిఠాపురం

ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు

శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలి
ముగింపు సభలో పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మూడు రోజుల పాటు జెవివి ఆధ్వర్యంలో జెఎన్‌టియుకెలో జరుగుతున్న జెవివి చెకుముకి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం ముగింపు సభ జరిగింది. ఈ సభకు పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రీయ దక్పథంతో ఆలోచిస్తేనే సమాజంలోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ ఏర్పాటే లక్ష్యంగా 38 ఏళ్లుగా జెవివి కృషి చేస్తుందన్నారు. మూఢవిశ్వాసాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య, నాణ్యమైన వైద్యం కోసం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని వివరించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింపజేసేందుకు, సైన్స్ పట్ల, ప్రయోగాల పట్ల ఆసక్తిని రేకెత్తించేందుకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జెవివి కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రయోగాల పట్ల ఆసక్తిని రేకెత్తించేందుకు యురేకా యురేకా సైన్స్ ప్రయోగాల పోటీలు వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మాట్లాడుతూ పెద్దలు మూఢనమ్మకాలను దూరంగా ఉండాలన్నారు. సత్యా స్కాన్ అధినేత కాదా వెంకటరమణ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ దృష్ట్యా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెద్దలనుకోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చెకుముకి సంబరాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, కాకినాడ సీపోర్ట్ సిఇఒ ఎం.మురళీధర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి వంశీకృష్ణ, చెకుముకి కన్వీనర్ కెఎంఎంఆర్.ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్ వర్మ, జెవివి రాష్ట్ర నాయకులు జిఎస్‌హెచ్‌పి.వర్మ, జి.మురళీధర్, కె.త్రిమూర్తులురెడ్డి, కె.శ్రీనివాస్, జి.నిర్మల, జెవివి జిల్లా నాయకులు వి.శ్రీరామారావు, వి.సత్యనారాయణరెడ్డి, మేకా సుబ్బారావు, దాడి పద్మనాభం, పద్మావతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ విజేతలను ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన ఎపిజె అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, శ్రీ నరసింహ గవర్నమెంట్ హైస్కూల్ (గుంటూరు) ద్వితీయ, జెడ్‌పిహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్ బుదిరెడ్డిపల్లి(శ్రీసత్య సాయి) తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా ప్రయివేటు పాఠశాలల విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన ది ఎతేన్సా స్కూల్ (కర్నూలు) ప్రథమ స్థానం, శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ (వైఎస్ఆర్ కడప) ద్వితీయ, ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ (కాకినాడ) తృతీయ స్థానాలు సాధించాయి.

104 ఉద్యోగుల సమస్యలపై నిరసన దీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర 104 సంఘం పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టి ఆర్‌జెడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన భవ్య యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా సంఘం నాయకు లపై కక్షసాధిపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇచ్చిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మందుల నిర్వహణపై, ఫిజికల్ రికార్డుల మెయింటినెన్స్‌పై భవ్య యాజమాన్యం శిక్షణ ఇవ్వకుండా అందులో జరిగే తప్పులకు ఉద్యోగులు బాధ్యత ఎలా వహిస్తారని ప్రశ్నించారు. 2022లో ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 7 ప్రకారం డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.18500 వేతనం చెల్లించాలని, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న డ్రైవర్లకు స్లాబు మార్చి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి ముగిసిన 104 వాహనాల స్థానంలో నూతన వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి 108 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాం, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల సంఘం నాయకులు నాయుడు, గేద్దాడ సత్యన్నారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషాబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మద్దతు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న 104 ఉద్యోగులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాదవ్

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా, ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ వ్యవస్థ పని చేయాలని అకాంక్షిస్తున్నట్లు ఎస్‌పి జి.బిందుమాధవ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సంవత్సరాంతపు నేర సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, నేర నివారణ చర్యలు, అసాంఘిక కార్యకలాపాల అదుపుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం చేకూరాలని, నేరస్తులకు శిక్ష పడేలా పక్కాగా దర్యాప్తు సాగాలని స్పష్టం చేశారు. మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎఎస్‌పి దేవరాజ్ మనీష్‌పాటిల్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, డిఎస్‌పి కె.శ్రీహరిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంఎన్.మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జెర్సీలను అందజేస్తున్న తుమ్మల బాబు

యువత క్రీడల్లో రాణించటం ద్వారా శారీరక ఆరోగ్యతోపాటు మానసిక వికాసం పొందగల్గుతారని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మంగళవారం మండలం చంద్రమాంపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి కోకో పోటీకి ఎంపికైన జిల్లా స్థాయి క్రీడాకారులకు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు. జనసేన యువజన విభాగం నాయకులు వెన్నా వెంకటేష్ అందజేసిన జెర్సీలను క్రీడాకారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు దాసు శివబాబు, వెన్నా సత్యనారాయణ, కంటి బోయిన ప్రసాద్, నూకల మంతి నానాజీ, ద్వారంపూడి చల్లారావు, జట్ల విజయబాబు, జీవ పాల్గొన్నారు.

అలరించిన ప్రసాద్ నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రదర్శన ఇస్తున్న ప్రసాద్

షిరిడీలోని సాయిబాబా ఆలయంలో ఇటీవల పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు అలమండ ప్రసాద్ చేసిన కూచిపూడి నృత్యం అందరిని అలరించింది. హైదరాబాద్‌కు చెందిన నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ, భద్రాచలంకు చెందిన భద్రాద్రి సంస్కృతి వారధి సంయుక్త ఆధ్వర్యంలో ఆయన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సచిన్ దివాకర్, తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం ఇచ్చిన నృత్య గురువులు చల్లా కొండలరావు, తులసి, షిర్డీ సాయి ఆలయ బోర్డు మెంబర్ సచిన్ దివాకర్‌కు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ వస్తువుకు బిల్లు తప్పనిసరి

ప్రజాశక్తి - జగ్గంపేట, పిఠాపురం

మార్కెట్‌లో కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవడం వినియోగదారుని హక్కు అని పిఆర్ కళాశాల వాణిజ్య విభాగాధిపతి, లెఫ్టినెంట్ జె.పాండురంగారావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ చెన్నారావు అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో జరుగుతున్న మోసాలు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, నాణ్యత లేని వస్తువులపై ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, వాణిజ్య విభాగం అధ్యాపకులు జి.సురేష్, అధ్యాపకులు పివివి.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం జరిగింది. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సుకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుభాషిణి అధ్యక్షత వహించారు. న్యాయవాదులు బిఎకె.ఈశ్వర్‌బాబు, గుదిమెళ్ళ శ్రీభాస్కరాచార్యులు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ముద్రగడను కలిసిన గుడివాడ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ముద్రగడతో అమర్నాథ్, ఇతరులు

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఈ సందర్భంగా వారిద్దరూ చర్చించుకున్నారు. అనంతరం అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న ముద్రగడ గిరిబాబు రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీశివకుమారి, నాయకులు వాసిరెడ్డి భాస్కర్‌బాబు, గౌతు స్వామి, బెహరా దొరబాబు, రామిశెట్టి నాని, తదితరులు పాల్గొన్నారు.

31న నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 31న బుధవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన ఈ ఏడాది బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

కార్టూ'నిజం'



గర్భిణికి న్యూరో సర్జరీ విజయవంతం

ప్రజాశక్తి - కాకినాడ

రాజోలు ప్రాంతానికి చెందిన 9 నెలల గర్భిణీకి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను మెడికవర్ హాస్పిటల్స్ బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్య బృందం వెల్లడించింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బృందం సంబంధిత చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. మహిళకు 12 సంవత్సరాల వయస్సులో తీవ్రమైన జ్వరం రావడం వల్ల మెదడులో నీరు చేరే (హైడ్రోసెఫలస్) సమస్య ఏర్పడిందన్నారు. అప్పట్లో మెదడులో చేరిన నీటిని కడుపు భాగానికి మళ్లించేందుకు విపి షంట్ శస్త్రచికిత్స చేశారని, ప్రస్తుతం ఆమెకు ఇది మూడవ ప్రసవం కావడంతోపాటు, గతం నుంచి ఉన్న న్యూరో సమస్యలతో ఆ మహిళ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. గర్భధారణ చివరి దశలో మెదడులో నీటి ఒత్తిడి పెరగడంతో మెడికవర్ హాస్పిటల్స్‌లో చేర్చారని, తలనొప్పి, వాంతులు, చూపు మసకబారడం వంటి లక్షణాలు కనిపించాయని అన్నారు. స్కాన్‌లలో మెదడులో నీటి ఒత్తిడి గణనీయంగా పెరిగినట్టు గుర్తించినట్లు చెప్పారు. తల్లి, శిశువు ప్రాణాలను కాపాడేందుకు అత్యంత జాగ్రత్తలతో ప్రత్యేక వైద్య బృందం న్యూరోసర్జన్ పర్యవేక్షణలో విపి.షంట్ పనితీరును సమీక్షించి, గర్భధారణకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుని డాక్టర్ శ్రావణిసాక్షి ఆధ్వర్యంలో గర్భిణీకి విజయవంతంగా ప్రసవం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం మెదడులో చేరిన అధిక నీటిని తొలగించేందుకు న్యూరో సర్జన్ డాక్టర్ చందు లింగోలు అత్యంత నైపుణ్యంతో సర్జరీ నిర్వహించి నీటిని తొలగించారు. రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం తల్లి మరియు శిశువు ఇద్దరూ పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న వైద్య బృందం

ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

26న 'సుఖినోభవంతు' వార్షికోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

వచ్చే ఏడాది తమ సంస్థ 9వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవ సంస్థ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కాపవరపు కుమార్ తెలిపారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో ప్రముఖ వ్యాపారవేత్త కటకం రాంబాబు చేతులమీదుగా వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో అనేక సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్స్ అడబాల వీరభద్రరావు, అడబాల ప్రసాదరావు, డాక్టర్ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని తేజశ్రీకి డిఇఒ అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట

తేజశ్రీని అభినందిస్తున్న డిఇఒ రమేష్

మండలం పవర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని నిమ్మన తేజశ్రీని డిఇఒ పి.రమేష్ అభినందించారు. కౌశల్ పరీక్షలో రాష్ట్రస్థాయికి ఎంపిక అయిన సందర్భంగా మంగళవారం ఆయన విద్యార్థినికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక, రూ.1000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య, పాఠశాల హెచ్‌ఎం ఎంవివివి.గోపాలరావు ఆమెకు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పాల లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

పాల లారీ ఢీ కొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాజానగరం మండలం జిఎస్ఎల్ మెడికల్ కళాశాల చెంతనున్న పెట్రోల్ బంకు వద్ద మంగళవారం జరిగింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం పెదపాడుకు చెందిన పైలా సత్యసాయిమణికుమార్(22) బైక్‌పై రాజమహేంద్రవరంవైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంకు సమీపానికి చేరుకునే సరికి వెనుక నుంచిలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తల భాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో సత్యసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో ఐదుగురు మహిళల అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యూయలరీ దుకాణంలో వెండి ఆభరణాలు చోరీ చేసిన ఐదుగురు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మంగళవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 9న స్థానిక గోకవరం రోడ్డులోని శ్రీ కార్తికేయ జ్యూయలరీ షాపులో 8 మంది మహిళలు కస్టమర్లుగా వచ్చి షాపులో 8 జతల 350 గ్రాముల వెండి పట్టీలను చోరీ చేశారు. షాపు యజమాని క్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ ముఠాలోని ఐదుగురు మహిళా దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. బంగారు, వెండి, బట్టల షాపు యజమానులు మహిళా ముఠా సభ్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దుకాణాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ వద్ద మంగళవారం సారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...కాట్రావులపల్లి గ్రామానికి చెందిన తోట మణిస్వామిని 20 లీటర్ల సారాతో పట్టుకున్నారు. అతని వద్ద మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులకు అరెస్టు చేసి వారు వద్ద నుంచి 180 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమేంద్ర మంగళవారం తెలిపారు. గంజాయి రవాణాపై అందిన సమాచారం మేరకు కోటిపల్లి ఏటిగట్టు వద్ద అనుమానాస్పదం గా ఉన్న బ్రహ్మపురికి చెందిన మేడా కుమారస్వామి, యానాంకు చెందిన మల్లాడి వెంకట కార్తీక్‌లను అదుపులోనికి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుండి గంజాయి, మోటార్ సైకిల్, రూ.2500 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - రాజోలు

ఒక హత్య కేసులో పరారీలో ఉన్న నిందితులను ఏడేళ్ల అనంతరం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్ మంగళవారం రాజోలు సర్కిల్ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2018 ఏప్రిల్ 5 వ తేదీ రాత్రి పొదలాడలో మద్యం షాపు వద్ద ఒక దుప్పటి కోసం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో సోంపల్లి గ్రామానికి చెందిన కామాడి వీరరాఘవులను(46) అదే గ్రామానికి చెందిన కొప్పాడి శ్రీనివాస్, కొప్పాడి శ్రీను, జగతాని పల్లపు రాజు అను ముగ్గురు వ్యక్తులు తలపై బీరు బాటిల్‌తో కొట్టారు. తీవ్రగాయాలు పాలైన వీరరాఘవులను కుటుంబ సభ్యులు ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనగా బావించి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం వీర రాఘవులు మరణించాడు. కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని ఖననం చేశారు. కొన్ని రోజుల తర్వాత మద్యం షాపు వద్ద జరిగిన ఘర్షణ కారణంగానే వీరరాఘవులు చనిపోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 రోజుల అనంతరం పోలీసులు వీర రాఘవుల మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం గాలింపు చేపట్టారు. నిందితులకు స్థిరనివాసం, మొబైల్‌నెంబర్ సౌకర్యం లేక పోవడం, వీరు తరచూ హైదరాబాద్ వంటి దూర ప్రాంతా లకు పనుల కోసం వెళ్లి పోవడంతో వీరి ఆచూకీ కనుగొనడం కష్టంగా మారింది. ఏడు సంవత్సరాలుగా పరారీలో ఉన్న నిందితులు సోంపల్లి ఇసుకర్యాంపు వద్ద ఉన్నారని సమాచారం పోలీ సులకు అందింది. రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ హెడ్ కానిస్టేబుళ్లు కిషోర్, కోళ్ల వెంకటరమణ, అప్పలరాజు, కానిస్టేబుల్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించి నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. ఈకేసులో మూడవ నిందితుడు జగతాని పల్లపు రాజు మరణించాడని, మిగతా ఇద్దరిని అరెస్టు చేశామని సిఐ తెలిపారు.

క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆర్థిక సాయంతో జనసేన పార్టీ నాయకులు పేదలకు ఆహారాన్ని అందించారు.

డ్రమ్ సీడింగ్ సాగు మేలు

ప్రజాశక్తి - పెరవలి

డ్రమ్ సీడింగ్ సాగు మేలు చేకూరుస్తుందని రైతులకు అధికారులుకు సూచించారు. మంగళవారం కాపవరం గ్రామంలో సాగు విధానం సాంకేతిక పద్ధతి, డ్రమ్ సీడింగ్ విధానాన్ని జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకీష్ణ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ అందించారు. డ్రం సీడర్ విధానం వల్ల పెట్టుబడి తగ్గుతుందన్నారు. డిపిఎం యు మానస మాట్లాడుతూ డ్రం సీడ్ టెక్నాలజీ ద్వారా ఎకరానికి 10 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు.

పంచాయతీల పునర్విభజనపై కసరత్తు పూర్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి సమావేశంలో ప్రజాప్రతినిధులు

మండలంలో పంచాయతీల పునర్విభజనకు కసరత్తు పూర్తయింది. కోరంగి పంచాయతీ విభజన కోసం మంగళవారం సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ పూర్వస్థితిలోనే కొనసాగాలని 16 మంది సభ్యుల్లో సమావేశానికి హాజరైన 14 మంది ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కార్యదర్శి సురేష్ తెలిపారు. పటవల పంచాయతీ సర్పంచ్ పినిపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీని రెండుగా విభజించాలని సర్పంచ్‌తో సహా హాజరైన 11 మంది సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అయితే విభజించాల్సిన పంచాయతీలలో ఉండాల్సిన గ్రామాలు పట్ల భిన్నభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఎంపిటిసి సభ్యుల పరిధిలో ఉన్న ప్రాంతాలంతా ఒక పంచాయతీగా ఉండాలని 8 మంది అభిప్రాయపడగా, ముగ్గురు మాత్రం పటవల కేంద్రంగా ఏర్పడే పంచాయతీలో శాంతమూల ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సభ్యుల అభిప్రాయం ప్రకారం చేసిన తీర్మానాలను ఉన్నత అధికారులకు తెలియ జేస్తామని కార్యదర్శి రామరాజు తెలిపారు.

లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న శ్యామల

ఉపాధి హామీ చట్టంలో నాణ్యత, పారదర్శకతతో పాటు నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని పెద్దాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.శ్యామల అన్నారు. మంగళ వారం ఉపాధి హామీ పనులపై నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం 2023-2026 లో కార్మిక బడ్జెట్‌కు అనుగుణంగా సాధించిన పురోగతి, 2025-26 సంవత్సరానికి చేపట్టనున్న ప్లాంటేషన్, ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి కార్మిక నివేదిక స్థితిగతులు, క్లస్టర్ వారిగా సెల్ఫ్ వర్క్స్ ఒంటి అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపిడి ఎం.భానుప్రకాష్, జెఇ సతీష్, ఎపిఒలు కృష్ణంరాజు, రమణకుమార్, సురేష్, నాయుడు, కుమారస్వామి పాల్గొన్నారు.

యానాం వార్తలు

తాగునీటి కోసం ధర్నా చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్‌లో తాగునీటి కోసం మహిళలు ఆందోళనకు దిగారు. గత కొంతకాలంగా సంబంధిత ప్రాంతానికి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఇదే సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. పైపులైన్ పగిలిపోవడంతో తాగునీటిలో మురికి నీరు కలిసిపోతుందన్నారు. కలుషితమైన నీటిని తాగడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని అన్నారు. దీంతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సంబంధిత అధికారులను పిలిపించి ఆందోళనకారులతో చర్చలు సాగించారు. ఐదు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

రైతులను సత్కరిస్తున్న ఆర్ఎఒ అంకిత్‌కుమార్

ఘనంగా జాతీయ రైతుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక సర్వ శిక్ష అభియాన్ హాల్లో వ్యవసాయశాఖ డిడి చిక్కాల జోగిరాజు అధ్యక్షతన జాతీయ రైతుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీడీ జోగిరాజు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కోపరేటివ్ సొసైటీ మాజేటి సత్యభాస్కర్ రైతులను సత్కరించారు. సేంద్రియ వ్యవసాయంపై రైతు మిత్ర కృషీవల డైరెక్టర్ అడ్డాల గోపాలకృష్ణ వివరించారు. రబీ పంటలో సాగు రకాలు, ఎరువులు, చీడ పురుగులపై పెద్దాపురం ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త ఎఎస్ఆర్.శర్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదర్శ రైతులు కోన కొండబాబు, మొలగజ్జల ఆనందరావు, టి.నాగేశ్వరరావు, ఈలప్రోలు విష్ణువర్ధన్‌రావు, కొండమూరి భాస్కరరావులను ఆర్ఎఒ అంకిత్‌కుమార్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకే ఖాన్, విజయ్‌కుమార్, చినబాబు, రూప పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

పెద్దాపురం పట్టణంలోని పద్మనాభ కాలనీ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం రవికుమార్ అధ్యక్షతన బాల్య వివాహ ముక్త భారత్‌పై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఐసిడిఎస్, న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, ప్యానల్ లీగల్ అడ్వకేట్ సద్గురు దుర్గారావు మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యాభివృద్ధికి నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రాప్ స్వచ్ఛంద సంస్థ సోషల్ వర్కర్ బి.లక్ష్మి, పారా లీగల్ వాలంటీర్ ఎన్.అప్పలకొండ, కెవి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పిఠాపురం మండలం కుమారపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పాల్గొని బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, పాఠశాల హెచ్ఎం వై.విజయడేనియల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో మానహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాలని మానవ హక్కుల సంఘం నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత కొన్ని నెలలుగా ఛైర్‌పర్సన్, వైసిపి కౌన్సిలర్ల మధ్య విభేదాలు కారణంగా పట్టణ అభివృద్ధి కుంటుపడిందన్నారు. మున్సిపాలిటీకి రూ.1.45 కోట్ల నిధులు వచ్చాయని, ఆ నిధులను ఖర్చు పెట్టకపోతే తిరిగి వెనకకు వెళ్ళిపోయే ప్రమాదం ఉందన్నారు. రాజకీయాల కోసం పట్టణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుంచె నానిబాబు పాల్గొన్నారు. .

ఉపకరణాలకు 39 మంది గుర్తింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలో ఉపకరణాలు అవసరమైన 39 మంది వికలాంగులను గుర్తించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కృత్రిమ అవయవాలు అవసరమైన వారిని గుర్తించే కార్యక్రమం జరిగింది. టెక్నీషియన్ ఎం.వెంకట్రావు, పిఎన్ఒ స్మృతి, పరీజాలు కొలతలు తీసుకున్నారు. 39 మందికి అవసరమైన ఉపకరణాలను కాకినాడలో తయారు చేయిస్తామని ఉమామనో వికాస కేంద్రం ప్రతినిధి ఎంజి.గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి.రెడ్డి, ఎంపిడిఒ లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపిడిఒ విజెవి.రమణ, కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు వి.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయాల్లోనే షాపులు తెరవాలి

ప్రజాశక్తి - కరప

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రేషన్ షాపులను నిర్దేశిత సమయాల్లో తప్పక తెరిచి ఉంచాలని ఎంఎస్ఒ గొల్లపల్లి రామవీరభద్రరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారిక సమావేశాలకు డీలర్లు మాత్రమే హాజరుకావాలని, ఏట్టి పరిస్థితుల్లోనూ నామిని డీలర్లు హాజరు కావద్దని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపును తెరిచి ఉంచాలన్నారు. ప్రతీ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ మండలంలో ఉన్న అన్ని రేషన్ షాపులను తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వరరావు, డీలర్లు జెల్లా శివకుమార్, నక్క నాగేశ్వరరావు, మూడే చంద్రశేఖర్, పేపకాయల గోవిందరాజులు, జయలక్ష్మి, సత్యవతి, నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ఉన్న ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ గౌతమి హైస్కూల్లో మంగళవారం క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకలలో విద్యార్థులు పలు క్రిస్మస్ అభినయ గీతాలను ఆలపించి, క్రీస్తు జనన విధానాన్ని తెలియజేసేటువంటి నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడారు. కళాశాల యాజమాన్యం, ఆదర్శ్ కళాశాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల నందలి వర్కర్స్‌కు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి పాఠశాల ఛైర్‌పర్సన్ ఓరిగంటి సూర్యనారాయణ, కరస్పాండెంట్ బుర్ర అనురాధ, కళాశాల డైరెక్టర్ బుర్రా అఖిలేష్, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపల్ వైవిఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి అనుబాబు

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడతామని జడ్‌పిటిసి సభ్యుడు బుర్రా అనుబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అనుబాబు పంచాయతీరాజ్ శాఖలో పుంత, బిటి రోడ్ల అభివృద్ధికి రూ.34 కోట్లు వరకు మంజూరు అయ్యాయని తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచులు కోరిన రోడ్లకు సైతం ప్రతిపాదనలు పంపామన్నారు. దశలవారీగా రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా విరవాడ 2 ఎంపిటిసి అడపా రఘు మాట్లాడుతూ మిగిలిన పదవీ కాలంలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎంఎల్ఎ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఒక్క సమావేశానికి హాజరు కాలేదన్నారు. వారు సమావేశానికి వస్తే పలు సమస్యలపై చర్చించి, అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు ఏర్పాటు చేయకపోవడం, సర్పంచులు, ఎంపిటిసిల పేర్లు పెట్టడం లేదని ప్రశ్నించగా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ స్వప్న, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి

ప్రజాశక్తి - కరప

కాలువను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్

తుల్యభాగ డ్రెయిన్‌లోని గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చిన్న కొత్తూరు, వేలంగి, సహపురం డ్రెయినేజీల కాలువలను ఆయన పరిశీలించారు. వేలంగి తుల్యభాగ డ్రెయిన్‌పై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కాలువలు శుభ్రం చేయాలని, తూటుకాడ, గుర్రపు డెక్క, లేకుండా చర్యలు తీసుకోవాలని డ్రెయినేజీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, డ్రెయినేజీ అధికారులు కె.హేమలత, కె.సుబ్బారావు, ఇరిగేషన్ అధికారులు కీర్తి, భవాని పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - పిఠాపురం, జగ్గంపేట

పిఠాపురంలో రైతు వేషధారణలో విద్యార్థులు

పిఠాపురం భాష్యం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల వేషధారణలో అందర్నీ అలరించారు. సమీపంలోని పొలాలను సందర్శించి రైతులు చేస్తున్న వ్యవసాయ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు మాట్లాడారు. రైతుల కృషి వల్లే దేశానికి ఆహారం అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట శ్రీ చైతన్య స్కూల్లో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి రైతు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎజిఎం ఎం.సురేష్, ఆర్ఐ పి.శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్, కోర్డినేటర్ ఎస్.జనార్ధనరావు, డీన్ ఎ.నాగేంద్రబాబు, ఎఒ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విన్నర్‌గా పవర్ హంటర్స్ జట్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

ట్రోఫీను అందుకున్న పవర్ హంటర్స్ జట్టు

స్థానిక వీర్రాజు హైస్కూల్లో నిర్వహించిన పెద్దాపురం ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ టోర్నీలో పవర్ హంటర్స్ విన్నర్‌గా నిలిచింది. మంగళవారం పవర్ హంటర్స్, ఎయుకె జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పవర్ హంటర్స్ విన్నర్‌గా, ఎయుకె రన్నర్ జట్టుగా నిలిచింది. అనంతరం బహుమతి ప్రధానోత్సవ సభలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొరుపూరి రాజు పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సాయి, నాగేంద్రసాయి, భీమసాయి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
8th ADDITIONAL DISTRICT JUDGE AT
RAJAHAMAHENDRAVARAM, E.G.DISTRICT
M.V.O.P.No.685/2022

Between:-
Thota Veeramani and 4 Others ...Petitioners
and
Bandaru Krishna Murthy and 2 Others ...Respondents

R-2. Nandyala Manikanta S/o. N.Sambasiva Rao, Aged.46 years, Hindu,Male,Owner of Bus Bearing reg. No. AP 07 TN 3245, R/o. D.No.32-11/4-6, Kanchana Complex, Mogala Rajapuram, Jammi Chettu Center, Vijayawada, Krishna District, Vijayawada- 520010 - Vijayawada DMC- Cell: 7995673458.

The 2nd respondent mentioned above may take notice that the above M.V.O.P. filed by the petitioner claiming compensation under M.V. Act, is posted to 30-12-2025 for service of notice to the said 2nd respondent by way of paper publication and hence the 2nd respondent may take notice that they have to attend the Court at 10.30 A.M. on 30-12-2025 and if he fails to attend the court on the said day, he will be set-exparte and the case will be proceeded further in his absence.

(Sd/SRI.C.RAMA KRISHNA)
Advocate for the petitioner.
Rajamahendravaram,
Dt.23-12-2025.

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE: KAKINADA
I.A.340 of 2025, I.A.449/2023, O.S.No.134 of 2023

Between:
Canara Bank,
Nagamallithota Branch, Kakinada, Rep.,by its Chief Manager cum Authorized Officer.
...Petitioner/3rd Party
and
1) Venkata Raj
...Respondent/Plaintiff
2) Raja Mukarjee
...Respondent/Defendant

R2) Raja Mukarjee
aged 50 years, Plot No.5, Road No.2, Opposite Subha Niketan School, Ramanayyapeta, Kakinada Rural Mandal.

In the above matter the petitoner filed this petition against you. The Hon'ble court pleased to order notice to you for appearance either personally or through Advocate on 20-1-2026 at 10.30 a.m. Otherwise the matter will be disposed off in your absence.

G.S.M.N. SWAMY, B.Com, B.L.,
G.A.S.S. JYOTHI, B.L., Advocates,
#8-24-6, BF-1, KAKINADA - 4.
Cell: 9866191397

IN THE COURT OF IV ADDL. DISTRICT JUDGE
EAST GODAVARI :: KAKINADA
G.W.O.P. No : 114/2025

Between :
Petitioner: గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి
మరియు
Petitioner:

ప్రకటన

యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు గంధములో పిటీషన్ షెడ్యూల దాఖలా ఆస్తిలో మైనర్సు అయిన గుడిమెట్ల నవ్యశ్రీ, గుడిమెట్ల అమృతల తాలూకు వాటాను మైనర్స్ లబ్ధికొరకు అమ్ము కొనుటకు పర్మిషన్ యిప్పించవలసినదిగా కోరుచూ పిటీషనర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. అందుపై ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.06.01.2026 సం॥రం॥ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వార గాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను యిందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలాస్థి వివరములు:-

ఎ-షెడ్యూలు:- ప్రస్తుతం కాకినాడ జిల్లా, పూర్వం తూ॥గో॥జిల్లా, కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ వారి పరిధిలోని కాకినాడ నగరం తాలూకు రెవెన్యూ బ్లాక్ నెం.43, మార్కెట్ వీధి, డో.నెం:43-3-27, గల 1003.77చ॥గ॥ స్థలమునకు హద్దులు :తూర్పు : శ్రీ లలితసాయి బాలాజీ కన్స్ట్రక్షన్స్ వారి ఆస్తి, ఉత్తరం: చలువాది వారి ఆస్తి, పడమర: కాంపౌండ్ వాల్, దక్షిణం: శ్రీ లలితసాయి బాలాజీ కన్స్ట్రక్షన్స్ వారి ఆస్తి మరియు పురం వారి ఆస్తి.

బి-షెడ్యూలు:-ఐటమ్ నెం.1, ప్లాటు నెం.101, శ్రీ లలిత ఎన్‌క్లేవ్ 2 బెడ్రూమ్స్, ఆర్.సి.సి.ప్లాటు, గ్రౌండుఫ్లోర్, 1100 చ॥అ॥, తూర్పు: శూన్యకాశం, పడమర:కామన్ కారిడార్, ఉత్తరం: జాయింటు గోడ, దక్షిణం: శూన్యకాశం
యీ హద్దుల మధ్య చ.గ.44.35లకు అనిర్ధిష్టపు ఎ-షెడ్యూలు ఆస్థి.

ఐటమ్ నెం.2, ప్లాటు నెం.202, శ్రీ లలిత ఎన్‌క్లేవ్ 2 బెడ్రూమ్స్ ఆర్.సి.సి.ప్లాటు, ఫస్టుఫ్లోర్ 1100చ॥అ॥ తూర్పు: ప్లాటు నెం.201, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ప్లాటు నెం.203, దక్షిణం: శూన్యకాశం
యీ హద్దుల మధ్య చ.గ.44.35లకు అనిర్ధిష్టపు ఎ-షెడ్యూలు ఆస్థి.

ఐటమ్ నెం.3, ప్లాటు నెం.303, శ్రీ లలిత ఎన్క్లేవ్, 2 బెడ్రూమ్స్ ఆర్.సి.సి.ప్లాటు, సెకండ్ ఫ్లోర్ 1100 చ॥అ॥ తూర్పు: స్టేర్కస్, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: శూన్యకాశం, దక్షిణం: ప్లాటు నెం.302
యీ హద్దుల మధ్య చ.గ.44.35లకు అనిర్దిష్టపు ఎ షెడ్యూలు ఆస్థి.

ఐటమ్ నెం. 4, ప్లాటు నెం. 404, శ్రీ లలిత ఎన్క్లేవ్ 2బెడ్రూమ్స్ ఆర్.సి.సి. ప్లాటు, థర్డ్‌ఫ్లోర్ 1100 చ॥అ॥. పడమర: స్టేర్ కేస్, తూర్పు: శూన్యకాశం, దక్షిణం: ప్లాటునెం.401, ఉత్తరం: శూన్యకాశం
యీ హద్దుల మధ్య చ.గ. 44.35 లకు అనిర్ధిష్టపు ఎ షెడ్యూలు ఆస్థి.

యీ హద్దుల మధ్య గల ప్లాటు నెం. 101, 202, 303 మరియు 404కు ప్లాటులలో మైనర్ తాలూకు వాటా సమస్త యీజిమెంటు హక్కులుతో సహా.

KAKINADA
18.12.2025

పిటీషనర్ తరుపు న్యాయవాది
K.B. Pratap Kumar
G.SRINIVASA KUMAR
Advocates, KAKINADA - 534 211
Cell No: 9440133719
9848036321

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం
(మైనరు ఆడారి మానస వయస్సు 12 కొరకు)
G.W.O.P.128/2025

Between:-
1. Adari Mani W/o. Adari Veerababu, Hindu, aged 37year, R/o.D.No.2-223, Modhakondamma Temple Street, MainRoad, Korukonda Mandal, E.G.Dt.
2. Adari Manasa D/o.Adari Veerababu, Hindu aged 12years, R/o.D.No.2-223, Modhakondamma Temple Street, MainRoad, Korukonda Mandal, E.G.Dt.
...పిటీషనర్స్
And
Nill ...రెస్పాండెంట్స్

పై నంబరు గార్డియన్ గ్రంధంలో ఆడారి వీరబాబు గారి కుమార్తె అయిన ఆడారి మానస మైనరు అయినందున పిటీషనర్ ఆడారి మణి గారిని గార్డియన్‌గా నియమించమని మరియు మైనరు యొక్క అభివృద్ధి, చదువు, కొరకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుటకు అనుమతులు కోరుచూ దాఖలు చేసిన G.W.O.P. లో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల ది.12-1-2026 ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరైమీ యొక్క అభ్యంతరములు తెలుపవలసిందిగా యావ న్మందికి తెలియజేయడమైనది.

మైనరు యొక్క ఆస్తి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం శ్రీ కోరుకొండ సబ్‌రిస్ట్రారు వారి ఆఫీసు పరిదిలో చేరిన శ్రీరంగపట్నం గ్రామపంచాయితీ ఏరియాలో చేరిన శ్రీరంగపట్నం గ్రామం తాలూకు గ్రామకంఠం రి.స.నెం.240రు లో డోరు నెం.2-227 రు గల ఇంటికి సమీపమున గల మా తాలుకు చ.గ.121.8లు లేక చ.మీ.102.312ర్లు ఖాళీ నివేశన స్థలమునకు కొలతలు, హద్దులు. తూర్పు: అ58.6లు, పంచాయితీ రోడ్డు, దక్షిణం : అ19లు పంచాయితీ రోడ్డు, పడమర : అ60లు, యల్లపు నూకరాజు గారి ఇల్లు, ఉత్తరం: అ18లు, పంచాయితీ రోడ్డు. సదరు హద్దులు మధ్య చ.గ.121.8లు ఖాళీ నివేశ్సస్థలమునకు అందలి యావత్తు ఈజిమెంటు హక్కులు, మార్గపు హక్కులతో సహా.

యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం
అడ్వకేట్,
కోటగుమ్మం
రాజమండ్రి
రాజమండ్రి
23-12-2025

10వ తరగతి ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం, S.పైడిపాల గ్రామానికి చెందిన పోలోజు వరహాలబాబు S/o.శ్రీను కాకినాడ నుండి రౌతులపూడికి వచ్చే క్రమంలో మార్గ మధ్యలో ఒరిజినల్ డాక్యుమెంట్ అయిన 10వ తరగతి (Marks list) సర్టిఫికెట్ పోయినది. కావున ఎవరికైన దొరికినచో నా ఫోన్ నెంబరుకు తెలపగలరు.

పోలోజు వరహాలబాబు
సెల్‌నెం.7680937614

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, శెట్టిపేట గ్రామం, డి.నెం.5-137, కాపురస్తులు, బయ్యే సురేంద్ర తండ్రి: వీరన్న అను నాయొక్క వైట్ కలర్ ఎమర్జన్సీ పాస్‌పోర్టు నెం.X472188 ది.24.10.2025న తేదీన జిరాక్స్ తీయించుకొను నిమిత్తం శెట్టిపేట గ్రామం నుండి నిడదవోలు వెళుచుండగా దారి మార్గంలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

బయ్యే సురేంద్ర తండ్రి: వీరన్న
ఫోన్: 8978557166

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామ కాపురస్తులు ప్రత్తిపాటి దయమణి W/o. దేవసహాయం అనే పేరుతో పాస్‌పోర్టు ఉంది. పాస్‌పోర్టు నెంబరు W 5292736 Dt.19-10-2022 తీసుకోవడం జరిగింది. నేను నిడదవోలు నుండి రాజమండ్రి RTC బస్‌లో వెళ్ళుతుండగా బేగ్‌లో నుండి నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినవి. దొరికిన వారు ఈ అడ్రస్‌కు తెలియచేయగలరు.

ప్రత్తిపాటి దయమణి
W/o. దేవసహాయం,
కోరుమామిడి, నిడదవోలు మండలం
తూ॥గో॥జిల్లా, సెల్.8374591538

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సిటీ, అశోక్ నగర్, సాయిబాబా గుడివీధి, సంతోషి అపార్ట్‌మెంట్, డో.నెం.67-2-4/S-7రు కాపురస్తులు సూరత్తు శివనాగ శేషాద్రి గారి కుమారుడు సూరత్తు వెంకట స్వామి త్రిషాల్ అను నేను యావన్మందికి తెలియ జేయునది ఏమనగా,
నా యొక్క పాస్‌పోర్ట్ నెం. K5111733, తేది 18-06-2012 కలది నేను పాస్‌పోర్టు రెన్యువల్ నిమిత్తం ది.17-12-2025 తేదీన మా ఇంటి నుండి రామకృష్ణారావు పేటలోని రమణ ట్రావెల్స్‌కు వెళ్ళి తిరిగి సర్పవరం జంక్షన్ మీదుగా మా ఇంటికి వచ్చుచుండగా మార్గ మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. కావున ఈ పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

సూరత్తు వెంకట స్వామి త్రిషాల్
డో.నెం.67-2-4/S7, సంతోషి అపార్ట్‌మెంట్స్
అశోక్‌నగర్, కాకినాడ సిటీ, సెల్: 8143656789

పేరు మార్పు

తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, మద్దూరులంక, వాడపల్లి గ్రామ కాపురస్తులు బొలిశెట్టి చిట్టి గణేష్ గారి భార్య బొలిశెట్టి శ్రవణజ్యోతి అనే నేను నా వివాహమునకు ముందు నాపుట్టింటి ఇంటిపేరుతో నా పేరు దూడల శ్రవణజ్యోతి అయి ఉన్నది. నా వివాహం అయిన దర్మిలా నా ఇంటి పేరు దూడల శ్రవణజ్యోతి నుండి బొలిశెట్టి శ్రవణజ్యోతిగా మారినది. పైన తెలిపిన విధంగా దూడల శ్రవణజ్యోతి మరియు బొలిశెట్టి శ్రవణజ్యోతి ఈ రెండు పేర్లు నాకు సంబంధించినవే వేరే ఏ ఒక్కరికి సంబంధించినవి కావు. ప్రస్తుతం నా పేరు బొలిశెట్టి శ్రవణజ్యోతి అయివున్నది. భవిష్యత్తులో ఎప్పుడూ కూడా నాపేరు బొలిశెట్టి శ్రవణజ్యోతి గానే కొనసాగిస్తాను.